వర్షాకాలం.. పాములు భయం

- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- అప్రమత్తతతోనే రక్షణ

బుట్టాయగూడెం: వర్షాకాలం.. పాముల భయం మొదలైంది. అటవీప్రాంతంలోని సరిహద్దు గ్రామాలు, దట్టమైన పొదల సమీపంలో పాములు తరచూ కనిపిస్తుంటాయి. రైతులు పొలాలకు నీరు పెట్టేందుకు, వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. ఈ సమయంలో అప్రమత్తంగా లేకపోతే పాముల రూపంలో ప్రాణాపాయం తప్పదు. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో పాము కాటు కేసులు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల బుట్టాయగూడెం మండలంలో పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. మండ్ర కప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి పాముల వల్లనే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా 50 శాతంపైగా పాముల వల్ల ప్రమాదం ఉండదు.


రక్త పింజర

పాము కాటువేసిన వెంటనే సకాలంలో వైద్యం చేయించుకుంటే ఎటువంటి సమస్య ఉండదని, వీటి బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తతే ప్రధానమని వైద్యులు చెబుతున్నారు.

రక్తపింజర : ఈ పాము కాటు వేస్తే రెండు గంటల తర్వాత విషం శరీరానికి ఎక్కుతుంది. రక్తపింజర కాటువేసిన వెంటనే విషాన్ని తొలగించేందుకు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం అందించాలి. వైద్యుల పర్యవేక్షణలో పాము కాటుకు గురైన వ్యక్తిని ఉంచాలి.

నాగుపాము : ఇది అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కువగా ఎక్కుతుంది. ముందుగా పాముకాటు వేసిన చోట


నాగుపాము

గాయాన్ని తొలగించాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.


కట్లపాము

కట్లపాము : కాటువేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయించాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటువేయగానే గాయం పైభాగంలో కట్టుకట్టాలి. కొత్త బ్లేడుతో కాటు వేసిన చోట కొద్దిగా చర్మాన్ని తొలగించి రక్తాన్ని నోటితో తీసేయాలి. నోట్లో గాయాలు ఉన్నవారు ఇలా చేయకూడదు.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకోవాలి. యాంటీ వీనమ్ (విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.
- రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్ళేప్పుడు కాళ్లకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకెళ్లడం వల్ల పాము కాటు నుంచి రక్షించుకోవచ్చు.

క్లుప్తంగా

నేటి నుంచి జగన్నాథ ఉత్సవాలు

కొయ్యలగూడెం: అచ్యుతాపురంలో కొలువైన శ్రీ జగన్నాథ, బలభద్ర సహిత సుభద్రాదేవిల వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆషాడ మాసం ప్రారంభ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుని ఆలయ తరహాలో అచ్యుతాపురంలో ఆలయం, విగ్రహాలు ఉండటం ఇక్కడ విశిష్టత. ఇస్కాన్ సంస్థకు మాతృక అయిన శ్రీరామానంద గౌడీయ మఠం పర్యవేక్షణలో ఆలయ నిర్వహణ ఉంది. పూరిలో నిర్వహించే పూజలు ఇక్కడా నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతో పాటు దశావతారాల దినోత్సవాలను ఆలయంలో నిర్వహిస్తుంటారు. కొవ్వూరులో ఉన్న శ్రీ రామానంద గౌడీయమఠం వారు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ఏజెన్సీ మెట్ట ప్రాంత పూరీ క్షేత్రంగా బాసిల్లగలదని సర్పంచ్ మద్దిపాటి నాగమణి పేర్కొన్నారు.

దత్తాత్రేయునికి పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఉపాలయమైన దత్తాత్రేయ స్వామి వారికి గురువారం సందర్భంగా విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యవసాయ శాఖ ఏడీగా సుబ్బారావు


వై.సుబ్బారావు

చింతలపూడి : చింతలపూడి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా వై.సుబ్బారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.నాగకుమార్ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తానని సుబ్బారావు తెలిపారు.

మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలి


ధర్మాజీగూడెంలో మాంసం దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

లింగపాలెం: మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ సుందరి అన్నారు. గురువారం సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుద్ధ్యం పాటించాలని మాంసం దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుందరి మాట్లాడుతూ నిల్వ ఉన్న లేదా పాడైపోయిన మాంసం అమ్మరాదని, వ్యాధులు ఉన్న జీవాలను లేదా చనిపోయిన వాటిని కోసి అమ్మినా, నిల్వ మాసం అమ్మినా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు లింగపాలెం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ధర్మాజిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కొండ చిలువ హల్‌చల్


గదిలో ఉన్న కొండ చిలువ

చింతలపూడి : స్థానిక ఘంటావారి వీధిలో నివాసం ఉంటున్న దాసరి విజయకుమార్ ఇంట్లో భారీ కొండ చిలువ బుధవారం రాత్రి హల్‌చల్ చేసింది. విజయకుమార్ రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి రాగా కారు లైట్ల వెలుగులో వరండాలో కొండ చిలువను గమనించారు. కొండ చిలువ గదిలోకి దూరడంతో తలుపులు వేసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం చూసే సరికి గదిలో కొండ చిలువ లేదని బయటికి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

మల్లయ్య మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, డీసీసీ మాజీ డైరెక్టర్ తెల్లం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. అచ్చియ్యపాలెంలోని మల్లయ్య ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లయ్య మృతి పార్టీకి తీరనిలోటన్నారు. మల్లయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

లింగపాలెం: తోచలకరాయుడు పాలెంలో వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ తండ్రి సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు కొఠారి కుటుంబాన్ని గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, అన్నపనేని శాంతారావు, మట్టా సురేష్, భీమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పింఛన్ రూ.6 వేలు ఇవ్వాలి

టి.నరసాపురం: కళాకారులకు పింఛన్ రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రజా నాట్యమండలి నాయకుడు టీవీఎస్ రాజు, బుర్రకథ కళాకారుడు వీరమళ్ల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వేగంగా, అర్థవంతంగా తీసుకువెళ్లేది కళాకారులేనని వివరించారు. వారి కృషిని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు.

స్కూల్ గుర్తింపు రద్దు

కామవరపుకోట: వివాదాల నేపథ్యంలో తడికలపూడిలోని హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ గుర్తింపు రద్దు చేసినట్లు ఎంఈఓ డి.సుబ్బారావు గురువారం తెలిపారు. ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థుల సౌకర్యార్థం వారి టీసీలు, రికార్డ్ సీట్లు ఎంఈఓ కార్యాలయంలో తీసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 79818 47878లో సంప్రదించాలని ఎంఈఓ కోరారు.

పథకాలు సక్రమంగా అందాలి

చింతలపూడి : మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ కోరారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ధర్తీ అభ జన్ భాగీదరి గ్రామ్ ఉత్సవ్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం సర్పంచ్ శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రం సహకారంతో పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఐటీడీఏ ద్వారా మంజూరు చేయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలని కోరారు. ఎంపీడీఓ మురళీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ రక్తం కుమార్ పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

జంగారెడ్డిగూడెం: ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ధర్ముల సురేష్ పిలుపునిచ్చారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు నిండిన సందర్భంగా ఫాసిస్టు వ్యతిరేక దినంగా పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్మన్న స్మారక భవనంలో సభ నిర్వహించారు. నాయకులు పి.శ్రీనివాస్, కేవీ రమణ, కె.రాఘవ, ఎస్ రామ్మోహన్, కె.లతలు మాట్లాడారు.

మహాసభల పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేసిన నాయకులు

చింతలపూడి : జూలై 5, 6, 7 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం సన్నేపల్లి సాయిబాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో వనజ మాట్లాడారు. మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మహాసభలు జరిగే స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు డేగ ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య, ఎండీ మునీర్, బండి వెంకటేశ్వరరావు, కారం దారయ్య, హేమ శంకర్, బాడిశ రాము, కంచర్ల గురవయ్య, జేవి రమణ రాజు, కన్నబాబు, కొండేటి బేబీ, తొర్లపాటి బాబు, ఎం వసంతరావు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కుక్కునూరు: చింతలపూడిలో జూలై 5 నుంచి నిర్వహించే సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య కోరారు. సభల విజయవంతం కోరుతూ గురువారం మండలంలోని బరపటి నగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు కారం దారయ్య, కురాకుల బాబురావు, సాడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రోడ్డు గుంతలమయం


యాక్సిస్ బ్యాంకు వద్ద అధ్వానంగా ఉన్న ఏలూరు రోడ్డు


బస్టాండ్ సమీపంలో అధ్వానంగా ఉన్న ఏలూరు రోడ్డు

- ఎగసిపడుతున్న బూడిద
- ప్రయాణికులకు అవస్థలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఏలూరు రోడ్డు మొత్తం గుంతలతో అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై బోసు బొమ్మ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 1.5 కిలోమీటర్ల పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ఉన్న బస్టాండ్, షాపింగ్ మాల్స్, రెస్టారెండ్ తదితర షాపులకు వచ్చే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు స్కూల్ బస్సులు, వ్యాపారాలు, ఉద్యోగుల రాకపోకలతో రద్దీగా కనిపిస్తుంది. ఈ రోడ్డుపై అడుగడుగునా ఉన్న గుంతల్లో ఇటీవల డస్ట్ వేసి పూడ్చారు. ఈ డస్ట్‌పై వాటరింగ్ చేయకపోవడం వల్ల దుమ్ము ఎగిసిపడి ప్రయాణికులు కంటి, శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని దుకాణాల్లో దుమ్ము వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఏలూరు రోడ్డును పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బందులు

జంగారెడ్డిగూడెంలోని ఏలూరు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. బోసుబొమ్మ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న రోడ్డుపై బోసు బొమ్మ సెంటర్, యాక్సిస్ బ్యాంక్ వద్ద, లక్ష్మి థియేటర్, చందన బ్రదర్స్, కొత్త బస్టాండ్ వద్ద గుంతలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– వి.నిర్మల, జంగారెడ్డిగూడెం

అదుపు తప్పుతున్న వాహనాలు

పట్టణంలోని ఏలూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు డస్ట్ వేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వాహనాల వేగానికి డస్ట్ ఎగిసిపడి ఇబ్బందులు పడుతున్నాం. గోతుల వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. రద్దీ వేళల్లో గోతుల కారణంగా ట్రాఫిక్ జామ్ కూడా ఏర్పడుతుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

– ఐ.వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం

వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గురునాథరావు

లింగపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన మోసాలపై త్వరలో ప్రజల్లోకి తీసుకువెళతామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. గురువారం లింగపాలెంలో వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్ హౌస్‌లో ఆయన పార్టీ ముఖ్యనేతలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి రాగానే అమలుచేస్తామని చెప్పి, ఒక్కటీ పూర్తిగా అమలుచేయలేదని ఆరోపించారు. ప్రజలకు సమాదానం చెప్పే ధైర్యం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి లేదని, నిత్యం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్ర రాజకీయాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. పైగా ఎన్నికల్లో ప్రజలను నమ్మించేందుకు బాండ్లు తయారు చేసి వాటిపై కూటమి నాయకులు సంతకాలు చేసి మరీ ఇచ్చారని, కానీ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ఏడాదిలోనే చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి నేతల దుష్ప్రచారాలు, డైవర్షన్ పాలిటిక్స్‌పై ప్రజలకు పూర్తిగా అవగాహన వచ్చిందని తెలిపారు. రాజకీయ మనుగడ కోసం ఎంతకైనా దిగజారే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేత జగన్ ఆదేశాల మేరకు త్వరలో ఐదు వారాలు పాటు ప్రతి ఇంటికీ వైఎస్సార్ సీపీ నేతలు వెళ్లి చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన నష్టాన్ని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఎంతెంత ప్రయోజనం వచ్చేదీ వివరిస్తామని చెప్పారు. చంద్రబాబు మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ఒక అందమైన అబద్ధాన్ని సృష్టించి ప్రచారంచేసి ప్రజలను దగా చేసిన విధానాన్ని వివరిస్తామని చెప్పారు. సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, మండల ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, అన్నపనేని శాంతారావు, బి.ప్రభాకరరెడ్డి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న గురునాథరావు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ యు.రవిచంద్ర సూచించారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ, కళాశాల ఈగిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మత్తు పదార్థాలు సేవించినా, రవాణా, అమ్మకాలు, పండించినా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని డీఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా నో టు డ్రగ్, ఎస్ టు లైఫ్ అని ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీఓ కేఎస్ఆర్ కృష్ణ ప్రసాద్, సీఐ సుభాష్, ఎస్సై షేక్ జబీర్, ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జీఎస్ఎన్ మూర్తి, పూర్వ విద్యార్థి, కళాశాల అభివృద్ధి కమిటీ మెంబర్ అచ్చుత శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎన్. ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం : మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినదిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం : మానవహారం నిర్మించిన విద్యార్థులు, అధికారులు

మానవ మనుగడకు ప్రమాదం

కొయ్యలగూడెం: స్థానిక గణేష్ సెంటర్లో గురువారం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ నాగరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల ప్రభావం వల్ల మానవజాతి మనగడే ప్రమాదంలో పడబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై వి.చంద్రశేఖర్, ఎంఈఓ జె.సురేష్‌బాబు, ఈఓపీఆర్‌డీ జి.సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

చింతలపూడి : యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సీఐ క్రాంతి కుమార్ అన్నారు. ఎస్సై సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితాన్ని బలిచేసుకోవద్దు

లింగపాలెం: యువత తమ విలువైన జీవితాన్ని మత్తు పదార్థాలకు బలి చేయవద్దని తహసీల్దార్ నజీమ్ షా సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎ.సుందరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టి.నరసాపురం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం లక్ష్మి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో మానవహారంగా ఏర్పడ్డారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయులు బీఎల్‌స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

కామవరపుకోట: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని ఎంపీడీఓ కె.సరళ కుమారి అన్నారు. ఈ సందర్భంగా కామవరపుకోటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎలీషా, ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ చదువులో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

నేను సైతం అంటూ..

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో నేను సైతం అనే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

మత్తుకు బానిసలు కావొద్దు

బుట్టాయగూడెం: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని ఛిద్రం చేసుకోవద్దని ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి నెహ్రూ బొమ్మ వరకు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు.

అవగాహన ర్యాలీ

కుక్కునూరు: యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదని తహసీల్దార్ కె.రమేష్‌బాబు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహరావు, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శంకుచక్రపురం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చింతలపూడిలోని వెంకట్రామాబాగ్, మోడల్ కాలనీ, ఫైర్‌స్టేషన్ సెంటర్, బోయగూడెం, ఎస్‌బీఐ నగర్, చార్టెస్ నగర్, తుక్కుల కాలనీ, మండలంలోని శెట్టివారిగూడెం సబ్‌స్టేషన్, నామవరం ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కామవరపుకోట మండలంలో..

కామవరపుకోట: ఈస్ట్ యడవల్లి, తాడిచర్ల, ఆడమిల్లి, వీరిశెట్టి గూడెం, తడికలపూడి, సాగిపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక మారుతి నగర్, ఏలూరు రోడ్డు, రామచంద్రాపురం, సురపరాజు కాలనీ, సాయిబాబా స్తూపం, విజయలక్ష్మి కాలనీ ఏరియాల్లో అన్ని సర్వీసులకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

ద్వారకాతిరుమల మండలంలో..

ద్వారకాతిరుమల: మండలంలోని మెట్టగూడెం, రామన్నగూడెం, హెచ్ లింగపాలెం, దొరసానిపాడు, గుండుగొలనుకుంట, తాడిచర్ల, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు.

తాటి చెట్లను తొలగించాలని ఆందోళన


బర్రెవారిగూడెం ఆర్అండ్‌బీ రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

టి.నరసాపురం: రోడ్డుకు అడ్డంగా వేసిన తాటి చెట్లను తొలగించాలని కేతవరం పంచాయతీ బర్రెవారిగూడెం మహిళలు ఆందోళన చేశారు. తాము ఎంతో కాలంగా నడిచే రోడ్డు మార్గాన్ని కొందరు వ్యక్తులు తాటిచెట్లు, ముళ్లకంప వేసి మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై వేసిన తాడిచెట్లు, కంచెను తొలగించాలని, వీటిని వేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సుమారు 30 కుటుంబాలు వినియోగించుకుంటున్న రహదారిని మూసివేయడంతో గత రెండు రోజులుగా బయటకు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.

అందుబాటులో ఫ్రీజర్


ఫ్రీజర్‌తో ఆర్యవైశ్య సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: మృతదేహాన్ని భద్రపరచటానికి అవసరమైన బాడీఫ్రీజర్‌ను దాతల ఆర్థిక సాయంతో సమకూర్చుకున్నట్టు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఈ ఫ్రీజర్‌ను ప్రజలు వినియోగించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి రాంబాబు, వందనపు వెంకటేశ్వరరావు, టీవీఏ రామతారకం, తడిట్ల శ్రీనివాస రావు, దూబగుంట్ల బాపిరాజు, గుళ్లపూడి శ్రీనివాసరావు, నాగసూరి వసంతకుమార్, మహంకాళి శ్రీనివాసరావు, కొల్లేపర శ్రీఆనంద్, ప్రగళ్లపాటి కాశి పాల్గొన్నారు.